సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 28 । ఆగస్టు । 2024



ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ లక్ష్మి పూజలు వైభవంగా జరుగుతున్నాయి. 8లో



అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

హుకుంపేటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టవేయాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. 8లో



అప్పన్నకు గరుడసేవ

సింహాచలం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. 8లో



బాధ్యతగా రక్షణ

రేయింబవళ్లు రోగులకు వైద్య సేవలు అందించే వైద్యులకే రక్షణ కరువైతే.. అంతకంటే దారుణం మరొకటి ఉండదు. వైద్యులతో పాటు ఇతర శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ఇక మీదట ఇలాంటి ఆలోచన చేసేందుకూడా భయపడేలా శిక్ష ఉండాలి. ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మహిళా సిబ్బందికి భద్రత మరింతగా పెంచాలి.

– డాక్టర్ శ్రీకాంత్, ఫిజీషియన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అరకులోయ



కట్టుదిట్టంగా సెక్యూరిటీ



ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యుల రక్షణకు పటిష్ట సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. వైద్యులకు ఏమైనా జరిగితే తనకు పనిష్మెంట్ ఉంటుందన్న భయం ఆ సిబ్బందిలో ఉండాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళా వైద్యులు సేవలందించే టప్పుడు ఆస్పత్రికి ఎవరొస్తున్నారో, ఎవరు బయటకు వెళ్తున్నారో పకడ్బందీగా నిఘా పెట్టాలి. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వైద్యులు ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే స్పందించాలి. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – డాక్టర్ మానస, ఫిజీషియన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అరకులోయ.

న్యూస్‌రీల్

హడలెత్తిస్తున్న కింగ్ కోబ్రాలు



పాల్లూరు సమీపంలోని ధారాలమ్మ తల్లి గుడి పరిసరాల్లో సంచరిస్తున్న కింగ్ కోబ్రా

మోతుగూడెం: స్థానిక పంచాయతీ పరిధిలో రెండురోజులుగా కింగ్‌కోబ్రాల సంచారం కలవరపెడుతోంది. రెండు రోజుల క్రితం ఏపీ జెన్‌కో ఆస్పత్రి ఓపీ రూమ్‌లోకి ప్రవేశించడంతో ఆస్పత్రి సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. వెంటనే వారు అటవీ అధికారులు సమాచారమిచ్చారు. అయితే దానిని పట్టుకునేందుకు వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పొల్లూరు సమీపంలోని ధారాలమ్మ తల్లి గుడి పరిసరాల్లో సంచరిస్తూ స్థానికుల కంటపడింది. మోతుగూడెం ఫారెస్టు రేంజ్ అధికారి నానాజీ మాట్లాడుతూ పరిసరాల్లో అటవీ ప్రాంతం ఉన్నందున కింగ్ కోబ్రాల సంచారం ఉంటుందన్నారు. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన స్థానికులకు సూచించారు. ఎక్కడైనా కంటపడితే తమకు అందించాలని ఆయన కోరారు. వెంటనే స్నేక్‌కేచర్‌తో పట్టిస్తామని తెలిపారు.

నేటి నుంచి జోల్డా పండగ



చెట్ల కొమ్మలను తీసుకువస్తున్న కొత్త పాడేరు గిరిజనుడు

సాక్షి,పాడేరు: వరి పంట బాగా పండాలని ప్రకృతి దేవతలకు పూజలు చేస్తూ పొలాల్లో నాటుకునే ఔషధ గుణాల మొక్కల పండగకు గిరిజన రైతులు సిద్ధమయ్యారు. ఈనెల 28 నుంచి ఏజెన్సీలో జోల్డా పండగను జరుపుకునేందుకు వారు నిర్ణయించారు. ఈమేరకు అటవీ ప్రాంతాల్లో లభ్యమయ్యే జోల్డా, కసిమి, జీలుగ తదితర చెట్ల నుంచి కొమ్మలను సేకరించే పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

- పాడేరు పంచాయతీకి సంబంధించి బుధవారం కొత్తపాడేరు, గుడివాడ, లోచలిపుట్టు, సుండ్రుపుట్టు, పాతపాడేరు, పి.గొందూరులో పండగ జరుపుకుంటామని గిరిజనులు తెలిపారు. అడవి నుంచి తీసుకువచ్చిన ఔషధగుణాల చెట్టు కొమ్మలను వరి పొలంలో నాటితే చీడపీడల నుంచి పంటకు రక్షణ ఉంటుందని, దిగుబడి కూడా బాగా పెరుగుతుందని.. ఈ పండగను పూర్వం నుంచి జరుపుకోవడం ఆచారంగా వస్తోందని వారు పేర్కొన్నారు.

30న జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. అమెజాన్ వేర్ హౌస్, సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్, మెడ్‌ప్లస్ ఫార్మా, పేటీఎం, ఇన్నోస్ సోర్స్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 668 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. పికర్స్, సార్టర్స్, ఆపరేటర్ ట్రైనీ, రిలేషన్‌షిప్ మేనేజర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్, ఆఫీసర్ ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులు. 18 నుంచి 35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలకు నెలకు రూ.10,500 నుంచి రూ.21,000 వరకు వేతనం అందిస్తారు. అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరిగే మేళాకు హాజరు కావాలని అధికారులు కోరారు.

డ్రాగన్ వికాసం

శాశ్వత ఆదాయమిచ్చే పంటల్లో ఒకటైన డ్రాగన్ ఫ్రూట్ సాగు మన్యంలో విస్తరించనుంది. ఇప్పటికే ఈ సాగు చేపట్టిన రైతులు మంచి ఆదాయం పొందుతున్నందున ఈ పంటను ఉద్యానవనశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఈ సాగుపై ఆసక్తి చూపే రైతులకు ఉపాధి హామీ పథకంలో ఉచితంగా మొక్కలు ఇవ్వడమే కాకుండా అవసరమైన సాంకేతిక సమాచారం అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

- సాగుకు అనుకూలించిన వాతావరణం
- నాణ్యమైన పండ్ల దిగుబడి
- ఎకరాకు రూ.40 నుంచి రూ.50 వేల ఆదాయం
- గిరి రైతులను ప్రోత్సహిస్తున్న ఉద్యానవనశాఖ
- ఉపాధి హామీ పథకంలో ఉచితంగా మొక్కల పంపిణీ
- సాగు విస్తీర్ణం పెంచేందుకు కసరత్తు

నాటిన ఏడాది నుంచి ఆదాయం



ఈ ఫొటోలోని రైతు పేరు బవుడు అయ్యప్ప. ఈయనకు రెండు ఎకరాల భూమి ఉంది. తొలుత చిరుధాన్యాల సాగు చేసేవారు. తగిన దిగుబడి, ఆదాయం లేక వ్యవసాయం కలిసి రాలేదు. ఈ ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టిన రైతులు మంచి ఆదాయం పొందడాన్ని గమనించిన ఆయన ఈ సాగు చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో ఏడాది క్రితం తీసుకున్న మొక్కలు నాటారు. ఇప్పుడు ఏపుగా పెరిగాయి. దిగుబడి మొదలైంది. తొలి సంవత్సరం కావడంతో మోస్తరు దిగుబడి వచ్చింది. ఒకొక్క ఫ్రూట్‌ను రూ.50కు విక్రయించారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున రూ.60 వేల వరకు ఆదాయం వచ్చిందని ఆయన ఎంతో సంతోషంతో చెప్పారు.





చింతపల్లి మండలం గొందిపాకలులో డ్రాగన్ సాగు

సాక్షి,పాడేరు: మన్యంలో విదేశీ పంటల సాగుపై గిరి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టిన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. వీటిలో స్ట్రాబెర్రీ శీతాకాలం పంట. దీనికి చల్లని వాతావరణం అవసరం. డ్రాగన్ ఫ్రూట్ సాగు విషయానికొస్తే దీర్ఘకాలిక పంట. ఒకసారి నాటితే 20 ఏళ్లు దిగుబడి వస్తుంది. ఇలా శాశ్వత ఆదాయం ఇచ్చే పంటగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యానవనశాఖ అధికారులు గుర్తించారు. ఈ సాగు విస్తరణపై దృష్టి సారించారు. గత మూడేళ్ల నుంచి ఉపాధి హామీ పథకంలో ఉచితంగా మొక్కలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

- పాడేరు డివిజన్‌లోని 17 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. సుమారు 30,450 మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో అధికారులు వీటిని అందజేశారు. చింతపల్లి మండలంలోని తాజంగి, లంబసింగి, కిటుముల, పెదబరడ, గొందిపాకలు, కొత్తపాలెం గ్రామాల్లో 17మంది గిరిజన కుటుంబాలు 8.5 ఎకరాల్లో 15,300 మొక్కలు. డుంబ్రిగుడ మండలం గసాబ, అరకులో రెండు గిరిజన కుటుంబాలు ఎకరాలు 1800, జి.మాడుగుల మండలం వంజరి, గెమ్మెలి గ్రామాల్లో మూడు కుటుంబాలు 1.5 ఎకరాల్లో 2700 మొక్కలు నాటారు. జీకే వీధి మండలంలోని దుప్పులువాడలో ఒక రైతు అర ఎకరాలో 900 మొక్కలు, కొయ్యూరు మండలం డొనూరులో ముగ్గురు 1.5 ఎకరాల్లో 2700 మొక్కలు, ముంచంగిపుట్టు మండలం వనబసింగి, జోలాపుట్టు ప్రాంతాల్లో 8 మంది రైతులు 4 ఎకరాల్లో 7,050 డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటుకున్నారు.
- గత రెండేళ్ల నుంచి దిగుబడి రావడంతో ఏటా గిరిజన రైతులు నిలకడగా ఆదాయం పొందుతున్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఒక పండును గిరిజన రైతుల వద్ద వ్యాపారులు రూ.40నుంచి రూ.50కు కొనుగోలు చేస్తున్నారు. ఒకొక్క మొక్కకు 10 నుంచి 15 వరకు పండ్లు కాస్తున్నాయి. ఇలా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని గిరిజన రైతులు తెలిపారు. ఇలా కొనుగోలు చేసిన పండ్లను విశాఖ, గాజువాక, తుని, నర్సీపట్నం పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడి



డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఏజెన్సీ వాతావరణం అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడి వస్తోంది. ఇప్పటికే 17ఎకరాల్లో సాగు చేపట్టిన గిరిజన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25లో సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించడం వల్ల రుచిలో నంబర్ వన్‌గా నిలుస్తోంది.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి, పాడేరు

పోషక విలువలెన్నో.. : డ్రాగన్ ఫ్రూట్లో మంచి పోషకాలు ఉన్నాయి. అందువల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వంద గ్రాముల పండ్లలో కార్బోహైడ్రేట్లు 15.2 గ్రాములు, ప్రొటీన్ 0.36 గ్రాములు, ఫైబర్ 3.1 గ్రాములు, విటమిన్ సి 4.3 మిల్లీ గ్రాములు, ఐరన్ 0.18 మిల్లీ గ్రాములు, కాల్షియం 9 మిల్లీగ్రాములు, పొటాషియం 116 మిల్లీగ్రాములు ఉన్నాయి.

విద్యుత్ కార్మికుల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాలతో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

సీలేరు: రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 5న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, బిల్లు కలెక్టర్లు చేయనున్న ధర్నాకు సంబంధించి కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచ్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతీకార్మికుడిని రెగ్యులర్ చేయడమే కాకుండా, ,2022 పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ప్రతి కార్మికుడిని పీస్ రేటు నుంచి మ్యాన్ పవర్‌గా మార్చాలని ఆయన కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రతి కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసును ప్రాతిపదికగా తీసుకొని వారిని సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లతో వచ్చేనెల 5వ తేదీన జరిగే మహా ధర్నాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి విష్ణుకుమార్ మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు , మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్ 10 లక్షల వరకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏఎంసీలో అడ్మిషన్ల ప్రారంభం

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)లో 2024–25 సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొత్తం 250 సీట్లలో 37 సీట్ల భర్తీకి అఖిల భారత కోటాలో మంగళవారం మొదటి విడత కౌన్సెలింగ్ చేపట్టారు. నెల్లూరుకు చెందిన కండే శ్రీకర్ (3336), శ్రీకాకుళానికి చెందిన యు.మోహన్ కృష్ణ (4020), విశాఖపట్నం ప్రాంతానికి చెందిన యశశ్రీ (6091), ఎస్టీ కేటగిరీలో 63,527 ర్యాంక్ సాధించిన శ్రీకాకుళానికి చెందిన ఎస్.హితశ్రీ తొలిరోజు ప్రవేశం పొందారు. ఈ నెల 29వ తేదీలోగా అఖిల భారత కోటా సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించటంతో పాటు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశించారు. మండలంలోని లగిసపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. స్టాక్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. యోగక్షేమాలను తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే వారికి రూ.10వేల నగదు బహుమతిఅందజేస్తానని ప్రకటించారు. జీఎఫ్‌సీ, బ్రిడ్జి కోర్సులకు అధ్యాపకులను నియమించేలా చర్యలు తీసుకోవాలని, హెల్త్ వలంటీర్‌ను నియమించాలని ఆయనను విద్యార్థులు కోరారు. విద్యార్థులకు ప్రకారం ఆహారం అందించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సిబ్బందిని హెచ్చరించారు. ఎంపీటీసీ లకే రామకృష్ణపాత్రుడు, సర్పంచ్ వనుగు బసవన్నదొర, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, మినుముల కన్నాపాత్రుడు, పాంగి కన్నాపాత్రుడు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలి

పాడేరు : స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులు, ఇతర సిబ్బందికి ఆరు నెలల వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. మంగళవారం ఆయన ఐటీడీఏ పీవో అభిషేక్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని డి.గొందూరు పంచాయతీ మద్దులబంద గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి జంతరంగి ధారేశ్వర్‌కు కర్ణాటకలోని ధార్వాడ్ యూనివర్సిటీలో సీటు వచ్చిందని, అతనికి లాప్‌టాప్ అందించటంతో పాటు ఆర్థిక చేయూతనివ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఏజెన్సీలో పలు శాఖల గిరిజన ఉద్యోగులకు అక్రమ బదిలీలు ఆపాలని, అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, చింతపల్లి మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నిఘా కమిటీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : జిల్లా నిఘా కమిటీ సభ్యుల నియామకానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జనార్దనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో స్కావెంజర్ల ఉపాధిని నిషేధించిన నేపథ్యంలో పునరావాస చట్టం అమలులో భాగంగా జిల్లాలో నిఘా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కమిటీలో ఒక మహిళా సభ్యురాలితో పాటు నలుగురు సభ్యులను నియమిస్తామన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుద్ధ్య కార్మికుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలలోని కార్యకర్తలు, జిల్లాలో స్కావెంజర్స్ కమ్యూనిటీ కోసం ప్రాతినిధ్యం వహిస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తదారులు జిల్లాలో నివాసితులై ఉండాలన్నారు. ఆసక్తిగల అర్హులు బయేడేటాను జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి కార్యాలయానికి అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 7036408143 లో సంప్రదించాలని కోరారు.

మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలో మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోఆర్, ఎల్‌టీఆర్, ఎల్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఎల్‌ఏలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి అవార్డుల ప్రదానానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీకోసం)కు అందిన వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటిని తిరస్కరిస్తే తగిన కారణాలను తెలియజేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సవరించాలని, ప్రతీ మంగళవారం సమీక్ష ఉంటుందన్నారు. జనన, మరణ, కులం,ఆదాయ ధ్రువపత్రాల పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలోను కూలీ పనులు కల్పన, వంద రోజుల పనులు,ఉద్యానవన మొక్కలు నాటే పనులపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రంపచోడవరం నుంచి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

సకాలంలో మొక్కలు సరఫరా చేయండి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకం చాలా ముఖ్యమని, సకాలంలో నర్సరీల నుంచి సరఫరా చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడియం నుంచి మొక్కల సరఫరా సక్రమంగా లేదని, వచ్చే ఏడాది నుంచి అక్కడ కొనుగోలు చేయమన్నారు. కడియం నర్సరీలు మాఫియాగా మారాయని, అవసరమైతే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. స్థానికంగా నర్సరీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోలను ఆదేశించారు.రంపచోడవరం డివిజన్ పరిధిలో రబ్బర్ ప్లాంటేషన్‌కు అవకాశాలు అధికంగా ఉన్నందున ఇతర రాష్ట్రాల నుంచి కూడా రబ్బరు మొక్కలు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న వారం రోజులలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు.అమృత సరోవర్ చెరువులు, ట్యాంక్‌బండ్లు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉపాధి పనులకు సంబంధించి వందరోజుల కార్యాచరణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాడేరు, చింతపల్లి, లంబసింగి, అరకులోయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పీవోలను ఆదేశించారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని, మలేరియా మరణాలు సంభవిస్తే సహించేది లేదని హెచ్చరించారు.రూ.483కోట్ల బ్యాంకు లింకేజీ కల్పించాల్సి ఉండగా,రూ.70కోట్లు కల్పించడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకు లింకేజీ పనుల్లో వీవోలు,సీసీలు తప్పు చేసినట్టు తన దృష్టికి వస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించి బీఎల్వోలు సక్రమంగా స్పందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిపై ఎంపీడీవోలు సమీక్షలు జరపాలన్నారు. ఫారం6,7,8లను సక్రమంగా వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కట్టా సింహాచలం , డీఆర్‌డీఏ పీడీ మురళీ, డ్వామా పీడీ శివయ్య సీపీవో కొండలరావు,ఎంపీడీవోలు,ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థిని మృతి

- పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణం: మృతురాలి తల్లి రాములమ్మ ఆరోపణ
- గుండె సంబంధిత సమస్యవల్లే మృతి: కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్

చింతూరు: స్థానిక కేజీబీవీలో ఏడో తరగతి చదువుతున్న మామిళ్లగూడెంకు చెందిన విద్యార్థిని శ్యామల లక్ష్మీపార్వతి(13) భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతిచెందిందని తల్లి రాములమ్మ ఆరోపిస్తుండగా, ఆమెను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేశామని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రమాదేవి తెలిపారు. లక్ష్మీపార్వతికి ఆరోగ్యం బాగోలేదని అదే పాఠశాలలో చదువుతున్న మేనకోడలు జీవనజ్యోతి శనివారం రాత్రి ఫోన్ చేసి చెప్పిందని రాములమ్మ తెలిపింది. వెంటనే ఆదివారం ఉదయం పాఠశాలకు వెళ్లి తన బిడ్డను పంపమని అక్కడి ఉపాధ్యాయులను కోరగా పరీక్షలు ఉన్నందున పంపడం కుదరదన్నారని ఆమె తెలిపింది. వారిని ఎలాగోలా ఒప్పించి తన బిడ్డను పక్కనేఉన్న చింతూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మాత్రలు ఇచ్చారని, భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు ఆమె తెలిపింది. అనంతరం కుమార్తె లక్ష్మీపార్వతిని తీసుకుని స్వగ్రామమైన మామిళ్లగూడెం వెళ్లానని, సాయంత్రానికి ఆయాసం మరింత ఎక్కువైందని తెలిపింది. రాత్రి పది గంటల సమయంలో మళ్లీ చింతూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు రాములమ్మ చెప్పింది. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించడంతో అంబులెన్సులో తీసుకువెళ్లినట్టు వివరించింది. అప్పటినుంచి సోమవారం రాత్రి వరకు అక్కడి వైద్యులు చికిత్స అందించాని, అయితే రాత్రి 10 గంటలకు తనబిడ్డ మృతిచెందినట్లు ఆమె తెలిపింది. తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నా పాఠశాల సిబ్బంది తనకు తెలియచేయలేదని, తన మేనకోడలు ఫోన్‌చేసి చెబితే తెలిసిందని వాపోయింది. పాఠశాల సిబ్బంది స్పందించి ముందుగానే తనబిడ్డను ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉంటే బతికి ఉండేదని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. కాగా నెలరోజుల క్రితం రాములమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందాడు.



కుమార్తె లక్ష్మీపార్వతి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు



లక్ష్మీపార్వతి(ఫైల్)

శాయశక్తులా ప్రయత్నించాం: కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రమాదేవి

ఒక్కసారిగా అనారోగ్యానికి గురైన విద్యార్థిని లక్ష్మీపార్వతిని కాపాడేందుకు శాయశక్తులా కృషి చేసినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రమాదేవి తెలిపారు. విద్యార్థిని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఉందన్న విషయం తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి వైద్యుల సూచన మేరకు గుండె సంబంధిత పరీక్షలు కూడా చేయించినట్లు ఆమె వివరించారు. గుండె సంబంధిత సమస్య వల్ల ఆయాసం వస్తున్నట్లు తెలిపిన వైద్యులు అందుకు అనుగుణంగా చికిత్స అందిస్తున్న క్రమంలో విద్యార్థిని మృతిచెందినట్లు ఆమె తెలిపారు. శనివారం ఆమె ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఎంతో చలాకీగా ఉందని, ఆరోజు పాఠశాలలో నిర్వహించిన మూడు పరీక్షలు కూడా రాసిందని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళపద్మారాధన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

1న సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గోపాలపట్నం: జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభూజీ, కార్యదర్శి నరసింహానాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సెప్టెంబర్ ఒకటో తేదీన ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన ఆటగాళ్లు సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో అన్నవరంలో జరిగే అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలు మాత్రమే ఈ ఎంపికలో పాల్గొనాలని రైల్వే కోచ్ పి.రమణ సూచించారు.

ఆస్పత్రుల్లో అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి



కోలకతాలో జరిగిన సంఘటన బాధాకరమైనది. 24 గంటలూ పనిచేసే ఆస్పత్రుల్లో మహిళా వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు తప్పని సరిగా అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలి. ఔట్‌పోస్ట్ ఉంటే ప్రతిఒక్కరి వివరాలూ తెలుస్తాయి. మద్యం సేవించి వచ్చేవారు ఆస్పత్రిలోకి ప్రవేశించకుండా అదుపుచేయవచ్చు. కూనవరం సీహెచ్‌సీ (కోతులగుట్టలో)లో రాత్రి సమయాల్లో వాచ్‌మెన్‌లను మరింత అలర్ట్ చేసుసుస్తున్నాం.

– డాక్టర్ మహేష్ బాబు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ కూనవరం(కోతులగుట్ట)



చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే వైద్యరంగంలో మహిళా ఉద్యోగులకు మరింత భద్రత కలుగుతుంది. ఈ చట్టం ప్రకారం వైద్యులు,సిబ్బందిపై దాడులు జరిగితే ఫిర్యాదు అందిన ఆరు గంటల వ్యవధిలో నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.ఈ చట్టంపై విస్తృతంగా ప్రచారం కల్పించాలి ప్రభుత్వాలు సైతం మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– నాగమణి, స్టాఫ్ నర్స్, సీహెచ్‌సీ, ముంచంగిపుట్టు

-కూనవరం,ముంచంగిపుట్టు

ఆస్తులపై పిడుగు!



- త్వరలో మార్కెట్ విలువ సవరణకు సన్నాహాలు
- రహస్యంగా భూముల విలువ పెంపుపై కసరత్తు
- ప్రాంతాలను బట్టి 20 నుంచి 50 శాతం పెంచాలని ఆలోచన
- ఆదాయ పెంపు కోసం క్రయవిక్రయదారులపై భారం

విశాఖ సిటీ : భూముల క్రయ విక్రయదారులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటకముందే కుటిల బుద్ధి చూపించనుంది. ప్రభుత్వ ఖజానాను నింపుకోడానికి రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచాలని ఆలోచన చేస్తోంది. ఇందుకోసం భూముల మార్కెట్ విలువ సవరణపై నివేదిక తయారు చేయాలని ప్రభుత్వ పెద్దలు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఆ దిశగా జిల్లాలో రిజిస్ట్రేషన్ అధికారులు అప్పుడే రహస్యంగా కసరత్తు ప్రారంభించారు. రెవెన్యూ రాబడి కోసం క్షేత్ర స్థాయిలో మార్కెట్ ధరలపై స్థానిక సంస్థల అధికారులతో కలిసి విలువ ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వం తొలి షాక్




ఎన్నికలకు ముందు కూటమి నేతలు రిజిస్ట్రేషన్, విద్యుత్, ఆర్టీసీ ఇలా పలు శాఖల్లో ఛార్జీల పెంపు ప్రసక్తే ఉండదని బాకాలు ఊదారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజల నడ్డి విరిచి భారీగా ఆదాయాన్ని పిండుకోవాలని భావిస్తున్నారు. అధికారం చేపట్టి మూడు నెలల్లోనే ఇళ్లు, భూముల క్రయ విక్రయదారులకు తొలి షాక్ ఇవ్వడానికి సమాయత్తమవుతున్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయిందని, ఆదాయం పెంపు నెపంతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచాలని ఆలోచన చేస్తోంది. 2014 నుంచి 2019 మధ్య నాలుగు సార్లు భూముల విలువ సవరణ చేస్తే.. 2019–2024 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రెండు సార్లు మాత్రమే ధరలు పెంచారు. కోవిడ్ కష్టకాలంలో రాష్ట్ర ఖజానాకు రూపాయి ఆదాయం రాని సమయంలో కూడా రిజిస్ట్రేషన్ ధరలు పెంచలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయం కోసం మళ్లీ ప్రజల నడ్డి విరవాలని చూస్తోంది.

విశాఖే ఆశాకిరణం

రాష్ట్ర ఆదాయానికి విశాఖ ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్ర ఆదాయంలో 10 శాతం జిల్లాలో రిజిస్ట్రేషన్స్ ద్వారా సమకూరుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏటా భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.500 కోట్లు నుంచి రూ.600 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. 2023–2024లో రూ.731.69 కోట్ల లక్ష్యానికి గాను రూ.504.82 కోట్లు ఆదాయం సమకూరింది. తరువాత ఎన్నికల ఏడాది కావడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. దీంతో ఈ ఏడాది రూ.600 కోట్లు దాటలేదు. అయితే భారీగా భూముల విలువ పెంచడం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా ప్రభుత్వం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసింది.

10 నుంచి 50 శాతం వరకు..



ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో రిజిస్ట్రేషన్ అధికారులు భూముల మార్కెట్ విలువ సవరణకు అంచనాలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. వాస్తవానికి భూముల మార్కెట్ విలువ సవరణ విషయంలో శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో భారీగా భూములు విలువ పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూముల విలువలో కూడా భారీగా వ్యత్యాసం ఉండే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇక కమర్షియల్‌లోకి వచ్చే భూముల ధరలు 50 శాతానికి పైగా పెంచాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారులు, ఇతర రహదారుల పక్కనున్న భూముల విలువ రెట్టింపయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కనిష్టంగా 10 శాతం నుంచి గరిష్టంగా 50 వరకు విలువ పెంచనున్నట్లు టాక్ వినిస్తోంది.

కూటమికి మేలు చేసేలా సవరణ



ఈ ప్రతిపాదనల్లో కూటమి నేతలకు మేలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఏటా ఆగస్టులో భూముల మార్కెట్ విలువ సవరణలు చేస్తుంటారు. ఇప్పటికే విశాఖలో భూముల విలువ విపరీతంగా ఉండడంతో గత ప్రభుత్వం 2023లో ధరలు సవరించింది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కూడా ధరల సవరణకు సిద్ధమవుతోంది. ఇందులో కూటమి నేతల కోసం కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు స్వల్పంగా పెంచే విధంగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కూటమి నేతలు కొనుగోలు చేసే ప్రాంతంలో ధరలు పెంచకుండా.. ప్రస్తుతం వారి భూములు ఉన్న చోట భారీగా పెంచే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి పంపించే పనిలో రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

‘ఉపాధి’ పనుల్లో భారీగా అవకతవకలు



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న డ్వామా పీడీ తదితర అధికారులు

రాజవొమ్మంగి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో నిర్వహించిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగిన విషయం సామాజిక తనిఖీ ప్రజావేదికలో బయటపడింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ వరకు రూ.20.59 కోట్లతో 1,374 పనులు నిర్వహించారు. ఈ పనులపై మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ జరిగింది. ఈ మొత్తంలో వేతనాల రూపంలో చెల్లించింది రూ.15.83 కోట్లు కాగా, మెటీరియల్ రూపంలో చెల్లింపులు జరిగింది రూ. 5.12 కోట్లు అని అధికారులు వెల్లడించారు.

చనిపోయిన వారి పేరుతో పింఛన్ సొమ్ము స్వాహా

చనిపోయిన వ్యక్తులకు పింఛన్లు చెల్లించినట్టు రికార్డుల్లో పేర్కొని సిబ్బంది స్వాహా చేశారు. ఇలా రూ.14.17 లక్షల మేర అవకతవకలు జరిగినట్టు స్టేట్‌రిసోర్స్ పర్సన్ వెంకటరమణ వెల్లడించారు. కాగా ఇందులో రూ. 5.70 లక్షలు వెంటనే రికవరీ చేయాలని డ్వామా పీడీ శివయ్య ఆదేశించారని తెలిపారు. మరో వైపు కొలతల్లో తేడా, చనిపోయిన వారు పనులకు వచ్చినట్టు మస్తర్లు వేయడం తదితర అంశాలను గుర్తించినట్టు వెంకటరమణ తెలిపారు. మండలంలో 19 పంచాయతీల్లో ఇప్పటి వరకు కింద్ర పంచాయతీ లెక్కలు తేలాయన్నారు. ఇక్కడ జరిగిన అవకతవకలకు సంబంధించి రూ. 54 వేలు రికవరీకి ఆదేశించినట్టు చెప్పారు. మిగతా పంచాయతీలకు చెందిన వివరాలు బుధవారం వెల్లడిస్తామన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి ప్రజావేదిక కార్యక్రమాన్ని సందర్శించి, డ్వామా పీడీ శివయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీతో పాటు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు జ్యోతి, ఎంపీడీవో యాదగిరీశ్వరావు, ఏపీవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టవేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం పర్యటించి, స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పెదగరువు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రికి సందర్శించి వైద్యులతో మాట్లాడారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.



హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

వాగులో కొట్టుకుపోయిన గిరిజనులు సురక్షితం

- బైక్‌ను దాటిస్తుండగా ప్రమాదం
- కాసేపటికి ఒడ్డుకు చేరుకోవడంతో ఊపిరిపీల్చుకున్న స్థానికులు

ముంచంగిపుట్టు: బైక్‌ను దాటిస్తూ వాగులో కొట్టుకుపోయిన నలుగురు గిరిజనులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగు వద్ద సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు చెందిన రాజు వంతాల్ అనే గిరిజనుడు లక్ష్మీపురం బైక్‌పై బయలుదేరాడు. మార్గం మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిరిగూడ వాగును దాటించేందుకు అక్కడే ఉన్న స్థానికుల సహకారం కోరాడు.

దీంతో వారు బైక్‌ను దాటిస్తుండగా నలుగురు కొట్టుకుపోయారు. సంఘటన జరిగిన ప్రాంతానికి కాస్త దూరంలో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వారి సాయంతో వాగులోంచి బైక్‌ను బయటకు తీశారు.



బిరిగూడ వాగులో బైక్‌తో కొట్టుకుపోతున్న గిరిజనులు

వాగుపై వంతెన నిర్మించాలి

బిరిగూడ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ కోరారు. వాగులో నలుగురు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఆయన స్పందించారు. వర్షాకాలంలో బిరిగూడ వాగును దాటేందుకు లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. వంతెనతోపాటు రహదారి నిర్మించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

‘భైరవకోన’ భక్తులకు సౌకర్యాలు కల్పించండి



సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తికి సూచనలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): సింహాచలం సమీపంలోని భైరవకోన వద్ద భక్తులకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సింహాచలం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులు మంగళవారం కలెక్టర్‌ను అతని చాంబర్‌లో కలిసి భైరవకోన స్థితిగతులు, అమావాస్య సమయంలో భక్తుల రద్దీ, తదితర అంశాలను వివరించారు. ఈ క్రమంలో భక్తులకు కల్పించాల్సిన కనీస వసతులపై కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. తాగునీరు సమకూర్చాలని, రాత్రి పూట ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసుల గస్తీ, భక్తులు సేదతీరేందుకు అనువుగా సౌకర్యాలు కల్పించాలన్నారు.

3400 లీటర్ల వేస్ట్ ఆయిల్ స్వాధీనం

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రొతులపాలెంలో 3400 లీటర్ల వేస్ట్ ఆయిల్ కలిగి ఉన్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రొతులపాలేనికి చెందిన సారిక పైడినాయుడు, అప్పలనాయుడు, సుంకర సూర్యనారాయణల వద్ద 17 డ్రమ్ముల్లో ఉన్న 3400 లీటర్ల వేస్టు ఆయిల్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు.

72 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వేపోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3.6లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, సిబ్బంది మంగళవారం పలు స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సోలాపూర్ జిల్లాకు చెందిన సచిన్ రాజారామ్ దికోలే, ఆకాశ లోకనాథ లోకారే, గంజాంకు చెందిన ఎం.సురేష్ మహరాణా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. విశాఖపట్నం మీదుగా గంజాయిని ముంబయి, సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిని అదుపులోకి తీసుకుని.. 72 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు తెలిపారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విద్యార్థులు పాల్గొనాలి : కలెక్టర్

సాక్షి,పాడేరు: భారతీయ రిజర్వ్ బ్యాంకు నిర్వహిస్తున్న ఆర్‌బీఐ 90 ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో 25ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఈ క్విజ్ పోటీలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్‌బీఐ కార్యకలపాలను ప్రారంభించి 90 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతి టీమ్‌కు ఇద్దరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కళాశాల, అభ్యర్థుల వివరాలు నమోదు చేసుకోవాలని,సెప్టెంబర్ 15వతేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర,జోనల్,జాతీయ స్థాయి రౌండ్‌లు ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయి రౌండ్‌లో మొదటి బహుమతి రూ.2లక్షలు,రెండవ బహుమతి రూ.1.5లక్షలు, మూడవ బహుమతి రూ.ఒక లక్ష, జోనల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.5 లక్షలు,ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు,జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు,తృతీయ బహుమతి రూ.6లక్షలు ఇవ్వనున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలు,పాలిటెక్నిక్ కళాశాలలు విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆయన కోరారు.అండర్ గ్రాడ్యుయేట్లు కూడా ఈపోటీల్లో పాల్గోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం పి.మాతునాయుడు, నాబార్డు డీడీఎంఆర్ చక్రధరరావు పాల్గొన్నారు.



ఆర్‌బీఐ ఆన్‌లైన్ క్విజ్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్,ఇతర అధికారులు

ఎంటీబీఈ.. బీ అలెర్ట్!



- ఎసైన్షియాలో ప్రమాదానికి మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ లీకేజీ కారణం
- ఎంటీబీఈ తయారీ పరిశ్రమల్లో భయాందోళనలు
- మాక్ డ్రిల్ నిర్వహణకు ఎంటీబీఈ తయారీ పరిశ్రమలు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం : ఫార్మా పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటైన పరవాడ ఫార్మాసిటీతో పాటు అచ్యుతాపురం సెజ్‌లో కలిపి 200కి పైచిలుకు ఫార్మా పరిశ్రమలున్నాయి. వీటిలో సుమారు 50 వేల మంది పనిచేస్తున్నారు. మండే స్వభావం గల సంస్థల్లో అధికారులు తనిఖీలు సరిగ్గా చేపట్టకపోవడంతో భద్రతా ప్రమాణాలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఔషధ ఉత్పత్తుల తయారీలో కీలక యంత్రాలైన రియాక్టర్లు ఒత్తిడికి గురై పేలుడు సంభవిస్తే, ఆ ప్రమాద తీవ్రత భయంకరంగా ఉంటుంది. పేలుడు ధాటికి అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న రసాయనాలు బయటకు చిమ్మడం, దట్టమైన పొగలు, మంటలు చెలరేగడంతో అక్కడ పని చేస్తున్న వారు అగ్నికీలల్లో కాలిపోయో, శ్వాస ఆడకనో మృత్యుఒడికి చేరుతున్నారు. వీరిపై ఆధారపడ్డ కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయి.


పలు పరిశ్రమల్లో ఎంటీబీఈ

ఎసైన్షియాతో పాటు సెజ్‌లోని పలు పరిశ్రమలు ఎంటీబీఈని తయారు చేస్తున్నాయి. దీంతో ఆయా పరిశ్రమల్లోని ఫార్మా ఉద్యోగులు, కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. తయారీ బ్లాక్‌లోనే కాదు ఆ కంపెనీకి వెళ్లాలన్నా జంకుతున్నారు. ఆ పరిశ్రమలో ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైంది. ఎసైన్షియా ప్రమాద ప్రభావం మిగతా ఫార్మా పరిశ్రమలపై పడింది. కొందరు ఉద్యోగులు, కార్మికులు వివిధ కారణాల పేరుతో సెలవులు పెడుతున్నారు. దీంతో ఫార్మా ఉత్పత్తులు మందగించినట్లు తెలుస్తోంది.

మాక్ డ్రిల్‌కు సన్నాహాలు

ఉద్యోగులు, కార్మికుల సెలవుల్లో ఉండపోవడం, ఉత్పత్తికి విఘాతం కలగడంతో పరిశ్రమల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వారిలో భయాందోళనలు తొలగించేందుకు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాయి. ముఖ్యంగా ఎంటీబీఈ ఉత్పత్తవుతున్న పరిశ్రమలు భద్రతా ప్రమాణాలపై దృష్టిసారించాయి. తమ కంపెనీలో ఉత్పత్తవుతున్న ఎంటీబీఈ యూనిట్ పూర్తిగా సురక్షితమని.. నిర్భయంగా విధులకు హాజరవ్వొచ్చు అంటూ వారిలో ధైర్యాన్ని నూరిపోస్తున్నాయి. అదేవిధంగా ప్రమాదవశాత్తూ చిన్న చిన్న లీకేజీలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి.. దాని నుంచి ఎలా అధిగమించాలనే అంశాలపై ప్రతి కార్మికుడికీ అవగాహన ఉండేలా మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఎంటీబీఈ తయారీ ఫార్మా పరిశ్రమలు సిద్ధమవుతున్నాయి. అలాగే ఉద్యోగులు, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై శిక్షణ అందించనున్నాయి. భవిష్యత్తులో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించే వ్యవస్థను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

ఎంటీబీఈ.. వెరీ డేంజర్ !



అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ (ఎంటీబీఈ) తయారు చేస్తున్నప్పుడు లీకేజీయే. ఎంటీబీఈ అంటే కర్బన సమ్మేళనం. మనం సిరప్‌లు తాగుతున్నప్పుడు వివిధ రకాల ఫ్లేవర్లు వస్తుంటాయి కదా.. ఆ ఫ్లేవర్ల కోసం ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తుంటారు. మిథనాల్, ఐసోబ్యుటీలిన్ రసాయన చర్య ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తుంటారు. అమెరికాలో రోజుకు 10 వేల బ్యారెల్స్ వరకూ దీన్ని తయారు చేస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 35 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎంటీబీఈ ఉత్పత్తవుతుంటుంది. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ఎసైన్షియాలో 500 లీటర్ల ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తున్నారు. సిరప్‌లతో పాటు పిత్తాశయంలో ఏర్పడే రాళ్లని కరిగించేందుకు వాడే మందుల్లోనూ ఎంటీబీఈని వినియోగిస్తుంటారు. ఇది ఆవిరి రూపంలో ఉత్పత్తవుతుంది. దీన్ని రియాక్టర్ల ద్వారా ద్రవరూపంలోకి మార్చుతుంటారు. ఇది రంగులేని ద్రావకం. ఎంటీబీఈలో ఆక్సిజన్ శాతం అత్యధికంగా ఉంటుంది కాబట్టి.. మండే స్వభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇది చాలా డేంజర్‌గా పరిగణిస్తుంటారు. ఇది పండ్ల వాసన వస్తోంది.